క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శారదానగర్, లక్ష్మీగణపతి, వాంబేకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు. 11కేవీ హుడా సాయినగర్, మోహన్‌నగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదమరిస్తే అంతే..



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

తుక్కుగూడ: జనసంచారం అధికంగా ఉండే మున్సిపల్ కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు పక్క వీధికి వెళ్లే ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ నోరు తెరిచి ప్రమాదకరంగా మారింది. మరమ్మతులకు గురై రోజులు గడుస్తున్నా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ గుంత కారణంగా ఏదైనా ప్రమాదం జరగముందే సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణం అంటూ కూల్చివేత

అన్ని అనుమతులు ఉన్నాయని బాధితుడి ఆందోళన



వెంకటేశ్వర కాలనీలో కూల్చివేసిన ఇంటిగోడ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 4వ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీలో అన్ని అనుమతులతో 73 గజాల్లో ఇల్లు నిర్మించుని నివాసం ఉంటున్న ఇంటిని అక్రమ నిర్మాణం అంటూ ఫిర్యాదు అందిందని హెచ్‌ఎండీఏ అధికారులు వచ్చి కూల్చివేశారని బాధితులు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు. బాధితుడు జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడలో సర్వేనంబర్ 89, 90.. సర్వే నంబర్ 61బి మిడిల్‌లో ఉన్న 73 గజాల ప్లాట్‌ను కొనుగోలు చేసుకుని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన పర్మిషన్‌తో బ్యాంక్ లోన్ తీసుకుని ఇంటిని నిర్మించుకున్నానని అన్నారు. అన్ని అనుమతులతో ఇంటిని నిర్మించుకున్న తర్వాత ఇంటినంబర్ తీసుకుని భార్యపిల్లలతో అదే ఇంటిలో నివసిస్తున్నామన్నారు. ఎవరో ఇచ్చిన ఫిర్యాదు నెపాన్ని అడ్డం పెట్టుకుని మున్సిపాలిటీ కార్పొరేషన్ అధికారులు ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు కూలగొడుతున్నామని చెప్పి పర్మిషన్లతో కట్టుకున్న ఇంటిని కూల్చారని వాపోయారు.

రాంపూర్ ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఎన్నిక

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కిరణ్‌పూలే ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యాదయ్య, అధికార ప్రతినిధిగా నర్సింహ, ఉపాధ్యక్షులుగా శివశంకర్, శంకర్, ప్రధాన కారదర్శిగా కుమార్, కార్యదర్శులుగా హరీష్, శ్రీనివాస్, కోశాధికారిగా యాదయ్య, ప్రచార కార్యదర్శులుగా అర్జున్, అంజయ్య, గౌరవ సలహాదారులుగా శ్రీశైలం, విజయ్‌కుమార్, అంజయ్య, మహేష్‌తో పాటు, మరో పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నారాయణ, ఆంజనేయులు, మహేష్, బాలకృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

పన్నులతోనే గ్రామాభివృద్ధి: ఎంపీపీ

యాచారం: మార్చి 25లోపు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వంద శాతం వసూల్ చేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వసూల్ చేసే పన్నుల ద్వారా ప్రాధాన్యత కింద గుర్తించిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సూచించారు. పన్నుల వసూళ్లలో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యుల సహకారం తీసుకోవాలని సూచించారు. అదే విధంగా అన్ని గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని సూచించారు. ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేపట్టే సీసీ రోడ్లు వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పనుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని అన్నారు.

జిగేల్‌మంటున్న శివనారాయణపురం

- సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుతో కళకళలాడుతున్న కాలనీ
- వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం



శివనారాయణపురం కాలనీలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 22వ డివిజన్ శివనారాయణపురం కాలనీలో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో 32 డివిజన్లు ఉండగా ఏ డివిజన్‌లో లేని సెంట్రల్ లైటింగ్ సిస్టం శివనారాయణపురం కాలనీలో ఏర్పాటు చేశారు. శివనారాయణపురం కాలనీ రెండు దశాబ్దాల క్రితం ఏర్పడగా దిగువ మధ్యతరగతి వర్గాల వారు ఇక్కడ ఇళ్లను కొనుగోలు చేసుకుని స్థిరనివాసాలు ఏర్పరుచుకున్నారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ జీవిస్తున్నారు. ఈ ప్రాంతం లోతట్టు ప్రాంతమని రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలతో తేటతెల్లం అయింది. అతి భారీ వర్షాలకు శివనారాయణపురం వరదల్లో చిక్కుకుని చాలా ఇళ్లు ముంపునకు గురై ఆస్తినష్టం చెందారు. రెండేళ్ల క్రితం కురిసిన అతి భారీ వర్షాలను ఎప్పుడు చూడలేదని కాలనీవాసలు అంటున్నారు. ఇదిలా ఉండగా ధనప్రాణ కుటుంబాలను కాపాడుందుకు, అలాగే చెమటోడ్చి కట్టుకున్న ఇళ్లను రిక్షించుకోనేందుకు గత ఏడాదిన్నర క్రితం ఎస్ఎన్‌డీపీ పేరుతో స్పెషల్ నాలాను నిర్మించడంతో కొంత ఉపశమనం కల్గిందని చెప్పవచ్చు. ఇదిలా ఉండగా శివనారాయణపురం కాలనీ మీదిగా హైటెన్షన్ వైర్లు వెళ్లడంతో వెంచర్ చేసిన నిర్వాహకులు వైర్లు వెళ్లే ప్రాంతాన్ని వదిలిపెట్టి కాలనీకి ప్రధాన రోడ్డుగా మార్చారు. ఇటీవల ఆరోడ్డును సీసీ రోడ్డుగా మార్చి మధ్యలో డివైడర్ల రూపంలో హైమాక్స్ స్తంభాలను ఏర్పాటు చేసి చక్కదిద్దడంతో శివనారాయణపురం కాలనీ అందాలతో కనువిందు చేస్తోంది. రాత్రి సమయంలో జిగేల్‌మంటూ మెరు స్తూ కాలనీవాసులు ఆరోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. రూ.14 లక్షలతో మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో నాలుగు లైన్ల రోడ్డును వేసి ఐమాక్స్ లైట్ల ఏర్పాట్లు చేశారు. మంత్రి సబితారెడ్డి సహకారంతో 22వ డివిజన్‌ను 95 శాతం అభివృద్ధి చేశామని స్థానిక కార్పొరేటర్ వివరిస్తున్నారు. విస్తారంగా రోడ్ల కోసం 40 పీట్ల వరకు వదిలిపెట్టిన కాలనీలు ఉంటే శివనారాయణపురం కాలనీ మాదిరిగానే అభివృద్ధి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధికి కేరాఫ్ మారింది



ఇప్పటికే డివిజన్‌లోని లింకు రోడ్లన్నీటిని సీసీ రోడ్లుగా మార్చివేశాం. అస్తవ్యస్తంగా ఉన్న పెద్ద లింక్ రోడ్డుకు నిధులు వెచ్చించి నాలుగు లైన్ల రోడ్డుగా మార్చు చేశాం. డివిజన్‌లో కమ్యూనిటీ హాలును కూడా నిర్మించాం. చిన్నపాటి దావతులు, ఫంక్షన్‌లు చేసుకునే విధంగా డిజైన్ చేశాము. వరదల ముప్పునుంచి విముక్తి కల్పించేందుకు ఎస్ఎన్‌డీపీ పైప్‌లైను కూడా నిర్మించామనితెలిపారు. కొంత పెండింగ్‌లో ఉంది. మంత్రి సబితారెడ్డి సహకారంతో శివనారాయణపురం కాలనీ అభివృద్ధికి పాటుపడుతాం. భవిష్యత్‌లో మరిన్ని వసతులు కల్పించడంతో పాటు కాలనీని అభివృద్ధి చేస్తాం.

– లిక్కి మమత, కార్పొరేటర్

అమర జవాన్లకు నివాళి



నివాళి అర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

కందుకూరు: దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవాన్ల త్యాగం మరువలేనిదని ఏబీవీపీ నగర కార్యదర్శి అనేగౌని సాయికిరణ్ వారి త్యాగాన్ని స్మరించుకున్నారు. ఏబీవీపీ కందుకూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మండలంలోని నేదునూరు పరిధిలోని ఎస్సీ బాలుర వసతి గృహం ఆవరణలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో జగదీష్, సంతోష్, ప్రదీప్, ఈశ్వర్, శివకుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మాణిక్‌రెడ్డిని గెలిపించండి

కందుకూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన పాపన్నగారి మాణిక్‌రెడ్డికే మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు అన్నారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఆ సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ ఎడ్ల కల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో టీఎస్‌యూటీఎఫ్ సంఘం రాష్ట్ర కార్యదర్శులు మల్లేశ్, బింగి రాములయ్య మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి 35 సంవత్సరాలుగా నిర్విరామంగా కృషి చేస్తున్న మాణిక్‌రెడ్డినే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుగ్గ రాములు, జిల్లా కమిటీ కౌన్సిలర్ కృష్ణయ్య, మండల కార్యదర్శి ఈశ్వర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ కుమార్ పాల్గొన్నారు.



బైరాగిగూడ గురుకుల పాఠశాలలో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించండి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి



ధర్మభిక్షం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రవీంద్రాచారి, వెంకటరమణారెడ్డి, తదితరులు

మీర్‌పేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌లోని మండల పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యదర్శి అయోధ్య వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్రాచారి ముందుగా స్వాతంత్ర సమరయోధుడు ధర్మభిక్షం 101వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద ప్రజలకు తెల్లరేషన్ కార్డులతో పాటు వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు దశరథ్, శంకర్, రాజు, శత్రునాయక్, లక్ష్మమ్మ, రజియాబేగం, అంజయ్య పాల్గొన్నారు.

‘కేంద్రం నిధులను దారి మళ్లిస్తున్న కేసీఆర్’



శక్తి కేంద్రాల మీటింగ్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: కేంద్రం నుంచి వస్తున్న నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దారి మళ్లించి ప్రజలను, ప్రధాని మోదీని తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకు వెంకటరెడ్డి ఆరోపించారు. బుధవారం బడంగ్‌పేటలోని 32వ డివిజన్‌లో ప్రజాగోస–బీజేపీ బరోసా పేరుతో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రాల మీటింగులో వెంకట్‌రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర నాయకుడు కడారి జంగయ్య ముఖ్యులుగా హాజరై మాట్లాడారు. మాయమాటలతో ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదోవపట్టిస్తుందని విమర్శించారు. ప్రధాని మోదీ దేశ ప్రజల కోసం పనిచేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు గౌర రమాదేవి, బంగారు అనిత ప్రభాకర్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి శ్రీనివాస్, నాయకులు సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, నడికుడి యాదగిరి, ఏనుగు రాంరెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, చిత్రం శ్రీనివాస్, రాహుల్, గౌర రాకేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బైరాగిగూడ బీఆర్ఎస్ కమిటీ ఎన్నిక

కందుకూరు: మండల పరిధిలోని బైరాగిగూడలో బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఎండీ.దావూద్, ఎండీ.సర్వర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమై గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా పల్సె కృష్ణగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సయ్యద్ ఇమ్రాన్, ఉపాధ్యక్షులుగా అందుగుల కుమార్, ఎల్మినేటి దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా యాచారం జనార్ధన్, కార్యదర్శులుగా పండల నర్సింహా, యాచారం మల్లేష్, మహ్మద్ అయూబ్, కోశాధికారిగా గుల్వి కిరణ్‌ప్రసాద్, సలహాదారులుగా మహ్మద్ దావూద్, ఏనుగుల జంగయ్య, పలుస స్వామి, మహ్మద్ సర్వర్, పలుస వెంకటేష్, గుల్వి భగవంత్, పండల సృజిత్, కె.శంకరయ్య, పలుస సురేందర్, యూత్ అధ్యక్షుడిగా పలుస శివను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, నాయకులు జి.సామయ్య, మేఘనాథ్‌రెడ్డి, ఆనంద్, కాకి దశరథ, దీక్షిత్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, ఎంఏ.సమీర్, యాచారం మైసయ్య, ఉప సర్పంచ్ పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు నియామకపత్రం అందిస్తున్న నాయకులు

నిరుపేదల ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



ఎల్‌ఓసీ చెక్కును అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ : రాష్ట్రంలోని నిరుపేదల ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్ అని విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామానికి చెందిన కొప్పుల రుపావతి అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయాన్ని మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించారు. చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రోజు వందల మంది ఆర్థిక సాయం పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌గౌడ్, యాదయ్య, రుపావతి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



బాసగూడతండాలో సేవాలాల్ జయంతిలో గిరిజనులు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో గిరిజనుల ఆరాధ్య దైవం అయిన సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి గిరిజన సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగడ్డ తండాలో..

మహేశ్వరం: మహేశ్వరం మండలం ఉప్పుగడ్డ తండాలో బుధవారం నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మేయర్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ సూక్తులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తానని తెలిపారు.



మహేశ్వరం: వేడుకలో పాల్గొన్న మేయర్ పారిజాత, గిరిజనులు

క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: క్రీడలతో ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కర్కాస్ తండాలో తాలూకా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. మూడురోజులుగా కొనసాగుతున్న క్రీడా పోటీలు బుధవారంతో ముగిసాయి. గెలుపొందిన జట్లకు వరప్రసాద్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన రామ్‌నుంతల తండాకు రూ.20,000, ద్వితీయ స్థానంలో నిలిచిన కర్కాస్‌తండాకు రూ.10,000, తృతీయ స్థానం వచ్చిన కల్వకుర్తికి రూ.5000 వరప్రసాద్ అందజేశారు. సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, అనురాధ, నరేందర్‌గౌడ్, ఉపసర్పంచ్ రవి, శంకర్, ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, భరత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ధర్మభిక్షంకు నివాళి

ఇబ్రహీంపట్నం: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎంపీ కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని ఇబ్రహీంపటన్ంలో ఘనంగా నిర్వహించారు. పట్నంలో బుధవారం ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు రాములు, నిరంజన్, యాదయ్య, తాళ్ల మహేశ్, అశోక్, యాదయ్య, నర్సింహ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం గౌడ్ జయంతిని బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని ధర్మభిక్షం విగ్రహానికి భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు హరిశంకర్‌గౌడ్, దయానంద్, మండల బీజేపీ అధ్యక్షుడు విష్ణుగౌడ్, నాయకులు.. దేవేందర్‌గౌడ్, గణేష్, ధనుంజయ్, నర్సింహ, రమాదేవి, శ్రీలత, వడ్డేపల్లి పాపయ్యగౌడ్, ప్రవీణ్, బాలరాజు, బొడిగే రాజు, జంగమయ్య భూకైలాస్ పాల్గొన్నారు.

మనుధర్మ శాస్త్రాన్ని నిషేధించాలి

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

తలకొండపల్లి: మనుధర్మ శాస్త్రాన్ని తక్షణమే నిషేధించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో మనుధర్మ శాస్త్రాని నిషేధించాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. మనుధర్మ శాస్త్రం ఆవిష్కరణ కార్యక్రమాన్ని వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పూర్వపు మనుధర్మ శాస్త్రాన్ని ఆవిష్కరిస్తున్నారంటే భారత రాజ్యాంగాన్ని అవమానపర్చుతున్నట్లేనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మనుధర్మ శాస్త్రం ప్రకారం దళిత, బహుజనులకు.. విద్య, భూమి, ఉండకూడదని.. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మనుధర్మ శాస్త్రాన్ని దేశవ్యాప్తంగా అమలుచేయాలని కుట్రలు పన్నుతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు దళిత బహుజనులందరూ సంఘటితమై పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కిరణ్‌పూలే, కేవీపీఎస్ మండలాధ్యక్షుడు యాదయ్య, నర్సింహ, జంగయ్య, శ్రీశైలం, మల్లేష్, కుమార్, బాలరాజు, అశోక్, రాజీవ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలుస్తున్నాం

లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి



అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు: అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ బావండ్ల వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బాలాజీనగర్ అధ్యక్షురాలు గంగాపురం రమ్య కుమారుడు ఆయుష్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకిషన్‌రెడ్డి, బావండ్ల వెంకటేశ్ మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్‌లు సేవా కార్యక్రమంలో ఆదర్శంగా ఉన్నాయని అన్నారు. నిరుపేదల ఆకలి తీర్చడానికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం పేరుతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ రాంరెడ్డి, జిల్లా చైర్మన్ అంజయ్య, మాజీ అధ్యక్షుడు రమేశ్, కోశాధికారి కొండల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిబాలకృష్ణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ వేదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నేత సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్ సంగీత, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు యాదగిరి నర్సింహయ్య శాస్త్రి, శ్రీనివాస మూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, వైస్ చైర్మన్ రవికుమార్, ఎంపీటీసీ అంబాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యసాగరంలో...

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి ఈనెల 22 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ కరుణాకర్‌రెడ్డి, రాంనుంతల సర్పంచ్ సోన , కోనాపూర్ సర్పంచ్ కడారి మల్లమ్మ, ఎంపీటీసీ సరిత పంతునాయక్ కోరారు.

మల్లప్పగుట్ట శివాలయంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి శివాలయ బ్రహ్మోత్సవాలు నేటినుంచి ప్రారంభమై 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్ పాండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



తలకొండపల్లి: లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు